# సాక్షి ఖమ్మం

7

శుక్రవారం ꠰ 19 ꠰ జూలై ꠰ 2024




## ‘డీఎస్సీ’ తొలిరోజు ప్రశాంతం

ఉపాధ్యాయ నియామకాలకు నిర్వహిస్తున్న డీఎస్సీ పరీక్షలు గురువారం మొదలుకాగా తొలిరోజు ప్రశాంతంగా ముగిశాయి. 8లో



## ఉద్యమనేత ఇక లేరు...

మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు రాయల చంద్రశేఖర్ మృతి చెందగా వివిధ పార్టీల నేతలు సంతాపం తెలిపి నివాళులర్పించారు. 8లో

## న్యూస్‌రీల్

### సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

**ఖమ్మంమయూరిసెంటర్:** విదేశీ యూనివర్సిటీల్లో పీజీ, పీహెచ్‌డీ ప్రవేశాలు పొందిన జిల్లాలోని క్రైస్తవ, మైనార్టీ విద్యార్థులు సీఎం ఓవర్సీస్ పథకం కింద స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి ఎ.మహమూదీ సూచించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన దరఖాస్తుతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లు, మూడు జతల జిరాక్స్ ప్రతులను ఆగస్టు 27న సాయంత్రం 5 గంటల్లోపు కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు రెండు విడతల్లో రూ.20 లక్షల ఉపకారవేతనం, రూ.60 వేల వరకు విమాన చార్జీలు అందుతాయని వెల్లడించారు.

### విద్యాశాఖలో బదిలీల సందడి



ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఈఓ

**ఖమ్మం సహకారనగర్:** జిల్లా విద్యాశాఖలో బదిలీల సందడి మొదలైంది. ఈమేరకు జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్లు, అటెండర్ల బదిలీలకు డీఈఓ కార్యాలయంలో గురువారం జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ నేతృత్వాన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈమేరకు 19మంది జూనియర్ అసిస్టెంట్లు, ఎనిమిది మంది రికార్డు అసిస్టెంట్లు, 15మంది ఆఫీస్ సబార్డినేట్లను బదిలీ చేశారు. ఇక ఇంటర్మీడియట్ విద్యాశాఖలో ఐదేళ్ల సర్వీస్ పూర్తయిన వారు వంద మంది వరకు ఉన్నట్లు గుర్తించగా, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, ఉద్యోగులకు త్వరలో బదిలీ జరగనున్నాయి. డిగ్రీ కళాశాలలకు సంబంధించి ఖమ్మం ఎస్‌ఆర్ అండ్ బీఎస్‌ఆర్ కళాశాలలోని 78మంది అధ్యాపకుల్లో 50మంది, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 13మందికి అందరూ బదిలీ అయ్యే అవకాశముందని తెలిపారు. అయితే, ప్రిన్సిపాల్ ఉద్యోగ విరమణకు ఏడాది గడువే ఉండడంతో ఆమెను మినహాయించే అవకాశమున్నట్లు సమాచారం. నేలకొండపల్లి, మధిర, సత్తుపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఐదేళ్ల సర్వీస్ పూర్తయిన 20మంది వరకు అధ్యాపకుల బదిలీ జరనున్నట్లు తెలిసింది.

### ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షిత ప్రయాణం

**ఖమ్మంమయూరిసెంటర్:** నిపుణులైన డ్రైవర్లు ఉన్న ఆర్టీసీ బస్సుల్లోనే సుఖవంతమైన, సురక్షితమైన ప్రయాణం సాధ్యమవుతుందని ఖమ్మం ఆర్టీసీ రీజియన్ మేనేజర్ సరిరాం తెలిపారు. రీజియన్ పరిధిలోని పలు రూట్లలో ఈనెల 1నుంచి 16వ తేదీ వరకు డీలక్స్ బస్సుల్లో ప్రయాణించిన మహిళల్లో లక్కీ డ్రా ద్వారా విజేతలను ఎంపిక చేశారు. కాగా, సత్తుపల్లి – విజయవాడ రూట్‌లో రాములమ్మ, ఎస్‌కే.సైదాబీ, ఎం.ఉష, మణుగూరు – హైదరాబాద్ రూట్‌లో కె.దీప్తి, ఉజ్వల, కళావతి, ఖమ్మం – భద్రాచలం రూట్‌లో కె.రాధిక, అనసూయ, పద్మ, మధిర–హైదరాబాద్ రూట్‌లో రాజమంద, భారతి, ఉషశ్రీ మొదటి మూడు స్థానాల్లో నిలిచారని చెప్పారు. డిప్యూటీ రీజినల్ మేనేజర్(ఆపరేషన్స్), ఉద్యోగులు పాల్గొన్నారు.

# క్షణక్షణం.. ఉత్కంఠ

ఏటా గోదావరి వరదలను మోసుకొస్తే ఈసారి అందుకు భిన్నంగా అశ్వారావుపేట మండలంలోని పెద్దవాగులో వరద పోటెత్తింది. మునుపెన్నడూ జరగని విధంగా ఈ వరద నీటిలో 28 మంది చిక్కుకుపోయారు. బాధితులను కాపాడేందుకు రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తక్షణమే స్పందించారు. అలాగే, మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హైదరాబాద్ నుంచి కలెక్టర్, ఎస్పీకి ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. ఆపై మంత్రి పొంగులేటి పెద్దవాగు ఘటన తెలియగానే ఆ ప్రాంతం ఏపీకి సమీపాన ఉండడంతో ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్‌తో మాట్లాడారు. ఆపై బాధితులను రక్షించేందుకు రెండు హెలికాప్టర్లు ఏర్పాటుచేశారు. సాయంత్రం 6–15 గంటలకు ఘటనాస్థలికి చేరుకున్న హెలికాప్టర్లు బాధితులందరినీ సురక్షిత ప్రాంతాలకు చేర్చాయి. దీంతో గంటల తరబడి 28మంది బాధితుల ఆందోళన.. వారి కుటుంబాల్లో ఉత్కంఠకు తెరపడింది. – సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/అశ్వారావుపేట/అశ్వారావుపేట రూరల్

### ఒక్కసారిగా పెరిగిన పెద్దవాగు ప్రవాహం

- వరద నీటిలో చిక్కుకున్న 28 మంది
- హెలికాప్టర్ల ద్వారా రక్షించిన ప్రభుత్వం
- తక్షణమే స్పందించిన మంత్రులు పొంగులేటి, తుమ్మల
- పర్యవేక్షించిన జారే, జిల్లా అధికారులు



ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దవాగు

**అంతా ఇక్కడే..**

పెద్దవాగు వరదలో 28మంది చిక్కుకుపోయారనే సమాచారం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించింది. ఈ విషయం బయటకు రాగానే హైదరాబాద్‌లో ఉన్న మంత్రులు స్పందించి జిల్లా అధికారులను అప్రమత్తం చేశారు. దీంతో రుణమాఫీ సంబురాల్లో పాల్గొంటున్న అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఇల్లెందు మండలం సుదిమళ్లలో ఉన్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు తోడు ఎస్పీ రోహిత్ రాజు, భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ చేరుకున్నారు. అంతేకాకుండా ఏపీకి చెందిన పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, స్థానిక డీఎస్పీ సురేష్‌కుమార్ పర్యవేక్షణలో సహాయక చర్యలు చేపట్టారు.

**తెరుచుకోని గేట్లు**

అశ్వారావుపేట మండలంలో గురువారం కురిసిన భారీ వర్షానికి మండల పరిధిలోని గుమ్మడవల్లి పెదవాగు ప్రాజెక్టు నిండిపోయింది. దీంతో మధ్యాహ్నం 12 గంటలకు ప్రాజెక్టు మూడు గేట్లు తెరిచి వరద నీటిని దిగువకు వదిలేందుకు అధికారులు ప్రయత్నించారు. అయితే మూడో గేటు తెరుచుకోవడానికి పది నిమిషాలు మొరాయించింది. దీంతో ఎగువ నుంచి వచ్చిన వరద ఎదురుపోటు వేయడంతోనే ఉధృతి పెరిగినట్లు చెబుతున్నారు.



సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న భద్రాద్రి కలెక్టర్ పాటిల్, ఎస్పీ, ఐటీడీఏ పీఓ

**40ఏళ్లలో ఇలా ఎన్నడూ జరుగలేదు..**

1981లో పెదవాగు ప్రాజెక్టు ప్రారంభించాక ఇంత పెద్దమొత్తంలో బ్యాక్ వాటర్ రావడం ఇదే మొదటిసారని సమీప గ్రామాల రైతులు చెబుతున్నారు. నారాయణపురం కట్టమైసమ్మ తల్లి ఆలయం వరకు వరదనీరు వస్తుందని, కానీ గురువారం వరద నీరు అనంతారం గ్రామాన్ని ముంచేస్తుందన్న భయంతో గ్రామస్తులు ఇళ్లు ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోయారు. పండువారిగూడెం, అనంతారం మధ్య వాగు ఉధృతంగా ప్రవహించి ప్రజలు భయాందోళనకు గురయ్యారు. కావడిగుండ్ల, గుబ్బలమంగమ్మ గుడి ప్రాంతాల నుంచి అనంతారం, బచ్చువారిగూడెం మీదుగా వాగు వచ్చి పెదవాగు ప్రాజెక్టులో చేరుతుంది. గుబ్బలమంగమ్మ గుడి వద్ద ఎంత వరదొచ్చినా.. మొత్తం వచ్చి ప్రాజెక్టులో చేరుతుంది. గతంలో ఎప్పుడూ ఇలా జరగకపోగా బచ్చువారిగూడెం, ప్రాజెక్టు క్యాంపు, గుమ్మడవల్లి, నారాయణపురం ప్రజలు భయాందోళనకు గురయ్యారు. గుమ్మడవల్లిలోకి వరదనీరు వచ్చి చేరడంతో గ్రామస్తులు కొత్తూరు వెళ్లిపోయారు.

**అనుకున్నట్లే.. గండి**

గురువారం రాత్రంతా వరద ఇదేవిధంగా కొనసాగితే ప్రాజెక్టు తెగిపోయే ప్రమాదముందని ఆందోళన చెందారు. వారి ఆందోళనకు అనుగుణంగా రాత్రి 11గంటల సమయాన కుడి కాల్వ తూము వద్ద 40 మీటర్ల మేర గండి పడింది. దీంతో వరద సుమారు నలభైకిపైగా ఇళ్లను ముంచెత్తింది.

### బిక్కుబిక్కుమంటూ..

ఊహించని విధంగా పెద్దవాగు కన్నెర్ర చేయడంతో అందులో చిక్కుకున్న 28 మందికి పైప్రాణాలు పైనే పోయినంత పని అయింది. క్షణక్షణానికి పెరుగుతున్న వరద ఉధృతి, మరోవైపు అస్తమిస్తున్న సూర్యుడు.. ఈ తరుణంలో దేవుడే దిక్కు అన్నట్టుగా మారింది వారి పరిస్థితి. అయితే రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం చకచకా సహాయ కార్యక్రమాలు చేపట్టడంతో రాత్రి 7 గంటల సమయానికి బాధితులు సురక్షిత ప్రాంతాలకు చేరుకుని బతుకుజీవుడా అనుకున్నారు.

అయితే, ప్రమా దాన్ని ముందే ఊహించిన అధికారులు గుమ్మడవల్లి, కొత్తూరు వాసులను పెదవాగు ప్రాజెక్టు ఆశ్రమ కళాశాలకు తరలించడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. కానీ 70కి పైగా గొర్రెలు, పెద్దసంఖ్యలో ఆవులు, గేదెలు వరదలో కొట్టుకు పోయాయని స్థానికుల ద్వారా తెలిసింది. కాగా, పరిస్థితి అదుపులోకి వచ్చేవరకు ఏపీ, తెలంగాణ అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌ను మంత్రులు ఆదేశించారు. ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా చూడాలని, ఇప్పటికీ లోతట్టు ప్రాంతాల్లోని వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించడంతో రాత్రంతా అధికారులు పర్యవేక్షిస్తున్నారు.



వరద నుంచి బయటపడిన స్థానికులు, రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొన్న నేవీ అధికారులతో ఎమ్మెల్యే ఆదినారాయణ

### ఎప్పుడేం జరిగిందంటే..

- పెద్దవాగుకు వరద పోటెత్తడంతో ప్రాజెక్టు గేట్లు ఎత్తాలని నిర్ణయించిన అధికారులు
- ఉదయం 11 గంటలకు మొదటి గేటు, మధ్యాహ్నం 12–30 గంటలకు రెండో గేటు ఎత్తిన అధికారులు
- ప్రాజెక్టు కట్టాక ఎన్నడూ మూడో గేట్ ఎత్తే అవసరం రాకపోయినా.. ఇప్పుడు తప్పనిసరి కావడంతో ప్రయత్నాలు
- కానీ మూడో గేట్ మొరాయిస్తుండగానే... అంతకంతకూ పెరిగిన వరద
- ఔట్ ఫ్లో కంటే ఇన్‌ఫ్లో ఎక్కువగా ఉండటంతో పెద్దవాగులోకి వరద ఎగపోటు
- మధ్యాహ్నం ఒంటి గంటకు నారాయణపురం – బచ్చువారిగూడెంల మధ్య లోతట్టు ప్రాంతంలోకి చేరిన వరద
- మధ్యాహ్నం 1–15 గంటలకు ఆటోలో ప్రయాణిస్తున్న 15 మంది వరదలో చిక్కుకున్నారు.
- మధ్యాహ్నం 2–30 గంటలకల్లా ఆటోలో వచ్చిన వారితో పాటు పొలాల్లో ఉన్న వారినీ చుట్టుముట్టిన వరద
- 3గంటలకు బచ్చువారిగూడెం బ్రిడ్జి సమీపంలో ఎత్తయిన ప్రాంతానికి పయనం
- 3–30 గంటల సమయానికి బాధితుల పాదాలను తాకిన నీరు
- సాయంత్రం 4 గంటలకు చెట్లు, కరెంటు స్తంభాలు ఎక్కిన బాధితులు
- 5గంటలకు చెట్లు, కరెంటు స్తంభాలు కొట్టుకుపోవడంతో బాధితుల ఆర్తనాదాలు
- 5–30 గంటలకు విశాఖ నుంచి నేవీ హెలీకాప్టర్ రాక.. వరద ప్రభావిత ప్రాంతాల్లో గాలిలో చక్కర్లు
- ల్యాండ్ అయ్యేందుకు అనువైన ప్రదేశం లేక తిరిగి వెళ్లిపోయిన హెలీకాప్టర్
- 6గంటలకు బాధితుల మోకాళ్ల వరకు చేరిన నీరు.
- 6–15 గంటలకు ఏపీ నుంచి వచ్చిన నేవీ హెలీకాప్టర్
- సాయంత్రం 6–35 గంటలకు హైదరాబాద్ నుంచి మరో హెలీకాప్టర్ రాక
- రాత్రి 7గంటలకల్ల రెండు హెలీకాప్టర్ల సిబ్బంది సమన్వయంతో ఒడ్డుకు చేరిన బాధితులు

### రెండు హెలీకాప్టర్లతో...

పెద్దవాగుకు గురువారం మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో అకస్మాత్తుగా వరద పెరిగి ముందుగా ఒడ్డు వెంట ఉన్న పొలాలను చుట్టుముట్టింది. దీంతో పొలాల్లో ఉన్నవారు ప్రాణాలు కాపాడుకునేందుకు చెరువుకట్టకు దగ్గరలో ఎత్తయిన ప్రదేశం వైపు వెళ్లారు. ఆ తర్వాత క్రమంగా వరద పెరుగుతూ మధ్యాహ్నం 2:30 గంటల సమయానికి బాధితుల మోకాళ్లలోతు వరకు చేరింది. దీంతో తమను కాపాడాలంటూ అప్పటికే కుటుంబసభ్యుల ద్వారా వారు అధికారులకు సమాచారం ఇచ్చారు. ఇంతలోనే యంత్రాంగం చేరుకోగా సహాయక చర్యలపై మంత్రులు ఆదేశాలు జారీ చేశారు. ఇదే సమయాన ఏపీలోని వేలేరుపాడు మండలం అల్లూరినగర్ దగ్గర వరద నీటిలో ఒక కారు కొట్టుకుపోయింది. అందులో ఉన్న ఐదుగురిని కాపాడేందుకు ఏపీ ప్రభుత్వం నేవీ హెలీకాప్టర్‌ను పంపినా అప్పటికే స్థానికులు వారిని కాపాడారు. దీంతో నేవీ హెలీకాప్టర్ ఏలూరులో ఆగిపోయిన విషయం తెలుసుకుని ఇటు పంపించారు. ఆ హెలీకాప్టర్ ఘటనా స్థలికి 6:15 గంటలకు వచ్చింది. అప్పటికే కారుమబ్బుల కారణంగా వెలుతురు సరిగా లేదు. సహాయ కార్యక్రమాలు ఏ మేరకు జరుగుతాయో అనే సందేహం అందరిలోనూ నెలకొంది. కానీ నేవీ హెలీకాప్టర్ ముందుగా ప్రభావిత ప్రాంతంలో చక్కర్లు కొట్టి బాధితులు ఉన్న ప్రాంతాన్ని గుర్తించింది. ఆ తర్వాత 20 నిమిషాలకు తెలంగాణకు చెందిన మరో హెలీకాప్టర్ ఘటనా స్థలికి చేరుకుంది. 6:45 గంటలకు అసలైన రెస్క్యూ ఆపరేషన్ మొదలైంది. నేవీ హెలీకాప్టర్ లొకేషన్ ఆధారంగా బాధితులు ఉన్న చోటుపై లైట్ వేసింది. రెండో హెలీకాప్టర్ ఆ స్థలానికి చేరుకుని బాధితులకు రోప్ అందించింది. దీంతో విడతల వారీగా బాధితులను సురక్షితంగా బయటకు తీసుకురావడంతో రెస్క్యూ ఆపరేషన్ విజయవంతం అయింది. కాగా, వరదలో చిక్కుకున్న వారిని తీసుకొస్తున్న హెలీకాప్టర్ ల్యాండింగ్‌కు సరైన స్థలం లేక నారాయణపురంలోని వైకుంఠధామంలో దించడం గమనార్హం.



గ్రామ సమీపాన ల్యాండ్ అవుతున్న హెలీకాప్టర్

### ట్రాక్టర్ కోసం వెళ్లాను



పెద్దవాగు ఒడ్డు వెంట పొలం ఉండగా.. వరద వస్తుందనడంతో ట్రాక్టర్ తీసుకొద్దామని మధ్యాహ్నం 3–30 గంటలకు వెళ్లాను. అప్పటికే ట్రాక్టర్ నీటమునగడంతో వచ్చేస్తుండగా వరద పెరిగి నారాయణపురం రోడ్డును చుట్టుముట్టింది. దీంతో ఆటోలో వెళ్తున్నవారు ఆగిపోయారు. వారితో కలిసి కట్టమైసమ్మ గుడి దగ్గర మెరక ప్రాంతానికి చేరుకోగా వరద పెరుగుతూ వచ్చింది. చూస్తుండగానే చెట్లు, స్తంభాలు కూలుతుండడంతో ధైర్యం సన్నగిల్లింది. మూడు గంటలు అక్కడే ఉండగా ఫోన్‌లో ఇంట్లో వాళ్లతో మాట్లాడాను. ప్రాణాలు దక్కవనే భయం వేసినా వేసింది. సాయంత్రం హెలికాప్టర్లు చూడగానే ధైర్యం వచ్చింది. రోప్‌తో కిందకు దిగిన వ్యక్తి మమ్మల్ని ఒక్కొక్కరుగా పైకి ఎక్కించారు.

– మహేశ్, రైతు, నారాయణపురం

### బైక్ వదిలి చెట్టు ఎక్కా..



వాన మధ్యాహ్నం తగ్గడంతో పెద్దవాగు ఒడ్డు వెంట ఉన్న పొలానికి బైక్‌పై వచ్చాను. పని చేస్తుండగానే వాగు పైవరకు వరద చేరింది. బయటపడదామని అనుకునేలోగా వరద చుట్టుముట్టడంతో ట్టుంది. బైక్ అక్కడే వదిలేసి దగ్గర్లో ఉన్న వేప చెట్టు ఎక్కాను. వరద ఉధృతికి బైక్ కొట్టుకుపోయింది. నేను ఉన్న చెట్టు చుట్టూ వరద చేరడంతో ఫోన్‌లో ఊర్లో వాళ్లకు సమాచారం ఇచ్చాను. మరోవైపు ప్రాజెక్టు వద్ద చిక్కుకున్న కాపాడాలని ఫోన్ చేయడంతో ఎస్సై, తహసీల్దార్, ఎంపీడీఓకు తెలిపా. నన్ను కాపాడేందుకు మా ఊరు, పక్క ఊర్ల నుంచి సుమారు వంద మంది యువకులు మోకుతాళ్ల సాయంతో ఒకరి చేయి ఒకరు పట్టుకుని నా దగ్గరికి వచ్చి కిలోమీటరు దూరం మోస్తూ సురక్షిత ప్రాంతానికి తీసుకొచ్చారు.

– నిర్మల పుల్లారావు, నారాయణపురం పీఏసీఎస్ చైర్మన్

### క్షణాల్లో పెరిగింది



వర్షం తగ్గిందని పొలం దగ్గరికి వెళ్లాను. అప్పటికే చాలా మంది అక్కడ పొలం పనుల్లో ఉన్నారు. వరద ప్రవాహం పెరగడంతో కొందరు తిరిగి ఇంటికి వెళ్లారు. కాసేపు ఆగి వెళ్దామన్నట్టుగా పొలం పనిలో మునిగిపోయాను. కానీ కాసేపటికే ఊహించని విధంగా వరద పెరిగి చుట్టుముట్టింది. పరుగు పరుగున కట్టమైసమ్మ గుడి దగ్గరున్న మెరక ప్రాంతానికి చేరుకున్నాను.

– చందా మల్లికార్జునరావు, రైతు, నారాయణపురం

### ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని..



వేలేరుపాడు మండలం కోయిదా పీహెచ్‌సీలో ఫార్మసిస్టుగా పనిచేస్తున్నా. అత్యవసర మందులు తీసుకుని ఆటోలో వెళ్తుండగా వరదలో చిక్కుకున్నా. ఆటోలో 15 మంది ఉన్నాం. మధ్యాహ్నం 1–15 గంటలకు వరదలో చిక్కుకోగానే మా ఇంట్లో వాళ్లకు, అధికారులకు సమాచారం ఇచ్చా. అంతలోనే ప్రాణాలు కాపాడుకునేందుకు కొందరు కరెంటు స్తంభాలు, మరికొందరు చెట్లు ఎక్కారు. అయితే దూరంగా వరద ప్రవాహానికి చెట్లు కొట్టుకుపోవడం, స్తంభాలు కూలిపోవడం చూసి భయమేసింది. సుమారు నాలుగు గంటల పాటు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడిపాం.

– అనూష, కోయిదా

# రుణమాఫీ కోలాహలం

- మొదటి విడత 59 వేల ఖాతాల్లో రూ.264 కోట్లు జమ
- రైతు వేదికల వద్ద రైతులు, నేతల సంబురాలు
- పలు కారణాలతో చాలామందికి అందని రుణమాఫీ
- బ్యాంకులు, రైతువేదికలకు పరుగులు తీసిన అన్నదాతలు
- జాబితాల్లో పేర్లు లేని వారిలో ఆందోళన

**ఖమ్మంవ్యవసాయం:** జిల్లాలో రుణమాఫీ కోలాహలం నెలకొంది. గ్రామాల్లో ఎక్కడ చూసినా రుణమాఫీ పథకంపైనే గురువారం చర్చ జరిగింది. కాంగ్రెస్ ఎన్నికల హామీల్లో భాగంగా రూ.2 లక్షల పంట రుణాల మాఫీని ప్రారంభించగా.. తొలిదశలో రూ.లక్ష లోపు రుణాలు వారి ఖాతాల్లో జమ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈనేపథ్యాన హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పథకాన్ని ప్రారంభించారు. జిల్లాలోని 21 రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కార్యక్రమాన్ని ప్రసారం చేయగా, ఎంపీలు, ఎమ్మెల్యేల నేతృత్వాన సంబురాలు నిర్వహించారు. మరోపక్క రూ.లక్ష లోపు రుణాలు జాబితాలో పేర్లు లేకపోవడం, ఖాతాల్లో నగదు జమ కాకపోవడంతో ఏం జరిగిందోనని పలువురు రైతులు బ్యాంకులు, రైతువేదికల వద్దకు పరుగులు తీయడం కనిపించింది.

**జిల్లాలో 52వేల కుటుంబాలకు..**

జిల్లాలోని వివిధ బ్యాంకుల ద్వారా 3.21 లక్షల మంది రైతులు రూ.2,300 కోట్ల మేర నిర్దేశిత కాలంలో పంట రుణాలు తీసుకున్నట్లు ప్రభుత్వం వద్ద లెక్కలు ఉన్నాయి. ఇందులో రూ.లక్ష లోపు రుణాలను మొదటి విడతగా మాఫీ చేయాల్సి ఉంది. ఈమేరకు 52,617 కుటుంబాలకు చెందిన 59,172 బ్యాంకు ఖాతాల్లో రూ. 264,22,51,892 జమ చేశారు. వాణిజ్య బ్యాంకుల నుంచి తీసుకున్న పంట రుణాలను నేరుగా రైతుల ఖాతాల్లోనే జమ చేయగా.. డీసీసీబీ ద్వారా తీసుకున్న రుణాలు మాత్రం బ్యాంకు ఖాతాలోనే జమ అయ్యాయి. అక్కడి నుంచి రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంటుంది.

**చాలామందికి నిరాశే...**

రూ.లక్ష లోపు రుణం తీసుకున్న అందరికీ మాఫీ కావాల్సి ఉన్నా చాలామంది ఖాతాల్లో నగదు జమ కాలేదని చెబుతున్నారు. ఈవిషయమై ఓ బ్యాంకు అధికారిని వివరణ కోరగా... ఒకే రేషన్ కార్డు కలిగిన కుటుంబంలో ఇద్దరేసి వ్యక్తులు ఒకే బ్యాంకు నుంచి రుణం తీసుకుంటే ఒకరి ఖాతాలోనే నగదు జమ అయిందని తెలిపారు. అలాగే, భార్యాభర్తలు రుణం తీసుకున్నా రేషన్ కార్డు ఒకటే కావడంతో జాబితాలో ఒకరికే స్థానం దక్కిందని తెలుస్తోంది. ఇలా రకరకాల కారణాలతో పెద్ద సంఖ్యలో రైతులు రుణమాఫీకి దూరమయ్యారనే చర్చ జరుగుతోంది. ఈనేపథ్యాన రైతులు ఆందోళనతో బ్యాంకులు, రైతువేదికల వద్దకు వెళ్లి ఆరా తీశారు. కానీ అధికారుల వద్ద కూడా సమాధానం లేకపోవడంతో దాటవేశారు.

**డీసీసీబీలో కొందరికే...**

జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ) పరిధిలో మొదటి విడతగా 37,625 మంది రైతులకు రుణమాఫీ కోసం రూ.121,63,40,360 నగదు విడుదలైంది. ఈ బ్యాంకు పరిధిలో 1,69,864 మంది రైతులు రుణమాఫీకి అర్హులు ఉండగా, రూ.908 కోట్లు అందాలి. తొలి విడత రూ.లక్ష వరకు రుణాలు తీసుకున్న రైతులు 1,43,327 మంది ఉండగా, రూ.526 కోట్లు మాఫీ కావాల్సి ఉందని అధికారులు గుర్తించారు. కానీ ఇందులో కేవలం 37 వేల మందికి రూ.121 కోట్లు మాత్రమే అందాయి. అంటే, అర్హులుగా చెబుతున్న వారిలో నాలుగో వంతు మంది రైతులకు కూడా పథకం వర్తించకపోవడంతో మిగతా వారిలో నిరాశ అలుముకుంది.



రుణమాఫీ సంబురాల్లో భాగంగా కూసుమంచిలో ట్రాక్టర్ నడుపుతున్న ఎంపీ రఘురాంరెడ్డి

### సీతారాం.. వ్యవసాయం బాగాచేసుకో..

వీ.వీ.పాలెం రైతుకు సీఎం సూచన



సీఎంతో మాట్లాడుతున్న రైతు సీతారాం, పక్కన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తదితరులు

**రఘునాథపాలెం:** ‘సీతారాం ఎంత భూమి ఉంది... రుణమాఫీ ఎంత వచ్చింది.. మాఫీపై రైతన్నలు ఏమంటున్నారు’ అని సీఎం రేవంత్‌రెడ్డి రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెంకు చెందిన రైతు కుతుంబాక సీతారాంను ఆరా తీశారు. హైదరాబాద్‌లో రుణమాఫీ పథకాన్ని ప్రారంభించిన సీఎం, వీ.వీ.పాలెం రైతు వేదికలో పాల్గొన్న సీతారాంతో వీసీ ద్వారా మాట్లాడారు. ఈ సందర్భంగా రైతు బదులిస్తూ తనకు నాలుగెకరాల భూమి ఉందని, రూ.75 వేలు రుణ మాఫీ అయిందని చెప్పారు. ‘వ్యవసాయం బాగా చేయి, పిల్లలను మంచిగా చదివించుకో.. కాంగ్రెస్ ప్రభుత్వం అన్న మాట ప్రకారం రుణమాఫీ చేస్తున్న విషయాన్ని రైతులందరికీ చెప్పండి’ అని సీఎం సూచించారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వర్లు, డీఏఓ విజయనిర్మల, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ సురేందర్, జిల్లా ఉద్యానవన అధికారి రమణ, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు. కాగా, రైతువేదిక వద్ద సీఎం, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

# నేడు పాలేరుకు సాగర్ నీటి విడుదల

**కూసుమంచి:** నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుండి శుక్రవారం ఉదయం పాలేరు రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేయనున్నారు. పాలేరు రిజర్వాయర్‌లో నీటిమట్టం డెడ్ స్టోరేజీకి చేరడంతో తాగునీటి అవసరాలకు ఇబ్బందులు తలెత్తే అవకాశముందని గుర్తించారు. పాలేరు ఎమ్మెల్యే, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ విషయమై ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో చర్చించడంతో నీటి విడుదలకు అంగీకరించారు. ఈనేపథ్యాన శుక్రవారం డ్యాంనుంచి నీరు విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

# ముసురేసింది..

- జిల్లావ్యాప్తంగా వర్షం
- వేంసూరు, గంగారంలో అత్యధిక వర్షపాతం

**ఖమ్మంవ్యవసాయం:** జిల్లా అంతటా గురువారం వర్షం నమోదైంది. బుధవారం రాత్రి మొదలైన వాన గురువారం రాత్రి వరకు కొనసాగింది. గురువారం ఉదయం 8–30 నుంచి రాత్రి 8 గంటల వరకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా వేంసూరు, సత్తుపల్లి మండలంలోని గంగారంలో 45 మి.మీ.ల వర్షపాతం నమోదుకాగా.. సత్తుపల్లి మండలంలోని సదాశివునిపాలెంలో 37, సత్తుపల్లిలో 34.8, పెనుబల్లిలో 29.3, గొరారంలో 26.8, కల్లూరులో 22.3, తల్లాడ లో 18, వైరాలో 17.8, మధిర మండలం సిరిపురంలో 15.8 మి.మీల వర్షపాతం నమోదైందని అధికారులు వెల్లడించారు. ఇక మధిర, కొణిజర్ల మండలం గుబ్బగుర్తి, కొణజర్ల మండల కేంద్రం, చింతకాని, బోనకల్ మండలం రావినూతల, గేటు కారేపల్లి, రఘునాథపాలెం మండలం పంగిడి, కామేపల్లి మండలం లింగాల, ముదిగొండ, ఖమ్మం లోని ప్రకాష్‌నగర్‌లో కూడా వర్షప్రభావం కనిపించింది. ఈ వర్షంతో పలుచోట్ల చెరువులు అలుగు పోయగా, సాగులో ఉన్న పంటలకు ప్రయోజనకరంగా మారుతుందని రైతులు చెబుతున్నారు.



సత్తుపల్లి రూరల్ : అలుగు పోస్తున్న బేతుపల్లి పెద్దచెరువు

**బొగ్గు ఉత్పత్తికి అంతరాయం**

**సత్తుపల్లిరూరల్:** సత్తుపల్లి మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో పలు గ్రామాల్లోని చెరువులు, కుంటల్లోకి వరద చేరింది. బేతుపల్లి చెరువు నీటిమట్టం 16 అడుగులకు గాను 16.5 అడుగులకు చేరడంతో అలుగు పోస్తోంది. ఇక సత్తుపల్లి జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీల్లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. సుమారు 18వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి, లక్ష క్యూబిక్‌మీటర్ల మట్టి తొలగింపు నిలిచిపోయిందని పీఓలు ప్రహ్లాద్, నర్సింహారావు తెలిపారు. వర్షంతో ఓసీల్లో చేరిన నీటిని మోటార్ల సాయంతో తొలగిస్తున్నారు.

## క్లుప్తంగా

### గంజాయిని సమూలంగా నిర్మూలించాలి

పోలీస్ కమిషనర్ సునీల్‌దత్



ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్న సీపీ సునీల్‌దత్

**బోనకల్:** జిల్లాలో మాదక ద్రవ్యాల సరఫరా, వినియోగాన్ని సమూలంగా నిర్మూలించేలా ప్రత్యేక దృష్టి సారించాలని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ అధికారులను ఆదేశించారు. బోనకల్ పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులు పరిశీలించడంతో పాటు స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరుపై ఆరాతీశాక అదేసమయాన స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారుడితో మాట్లాడారు. అనంతరం ఎస్సై మధుబాబు, సిబ్బందితో సమావేశమైన సీపీ సునీల్‌దత్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని సూచించారు. మాదక ద్రవ్యాల సరఫరా, వినియోగానికి అడ్డుకట్ట వేసేలా గస్తీ పెంచాలని ఆదేశించారు. ప్రధానంగా విద్యార్థులెవరూ మత్తు మత్తు పదార్థాల బారిన పడకుండా విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలను నియమించి అవగాహన కార్యక్రమాలు తెలిపారు.

### పులి సంచరిస్తోందని ప్రచారం

**కూసుమంచి:** మండలంలోని మునిగేపల్లికి చెందిన ఓ రైతు పత్తి చేలో జంతువు పాదముద్రలు కనిపించడంతో పులి సంచరిస్తుందేమోనని స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. గురువారం ఉదయం గుర్తించిన పాదముద్రలను కొందరు ఫొటో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా, పులి తిరుగుతోందనే ప్రచారం జరిగింది. దీంతో రైతులు చేలకు వెళ్లడానికి వెనుకంజ వేశారు. ఈవిషయాన్ని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లగా పత్తి చేనులో కనిపించిన పాదముద్రలు అడవి కుక్క లేదా పిల్లివి అయి ఉంటాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

### 22న కేఎంసీ కౌన్సిల్ సమావేశం

**ఖమ్మంమయూరిసెంటర్ :** ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశాన్ని ఈనెల 22న నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్ణయించిన అధికారులు అజెండా, నివేదికల రూపకల్పనలో నిమగ్నమయ్యారు. నేడో, రూపో కౌన్సిల్లో చర్చించే అంశాలతో కూడిన అజెండా కాపీలను కార్పొరేటర్లకు అందజేసే అవకాశముంది.

### సంస్థ అభివృద్ధికి పాటుపడండి

**సింగరేణి(కొత్తగూడెం):** సింగరేణి సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని ఉద్యోగులకు ఏజీ ఎం పర్సనల్(వెల్ఫేర్) కె.శ్రీనివాసరావు సూచించారు. సంస్థలో పనిచేసి మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన కార్మికుల పిల్లలకు గురువారం ఆయన కొత్తగూడెంలోని ప్రధాన కార్యాలయంలో కారుణ్య నియామక పత్రాలు అందజేసి మాట్లాడారు. ఉద్యోగులు సుశీల్‌కుమార్, కిరణ్‌కుమార్, టి. శ్రీనివాసరావు, శ్యాంకిరణ్, సాయి స్వప్నిల్, నాయకులు రమణమూర్తి, పీతాంబరం పాల్గొన్నారు.

### నేడు గిరిజన హస్తకళల ఉత్పత్తుల మేళా

**భద్రాచలంటౌన్:** భద్రాచలం ఐటీడీఏ ఆవరణలోని గిరిజన భవనంలో శుక్రవారం గిరిజన హస్తకళల ఉత్పత్తుల మేళా నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఓ ప్రకటనలో తెలిపారు. ట్రైఫెడ్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఈ ప్రదర్శనలో గిరిజనులు రూపొందించిన అటవీ, చేనేత ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలు ఉంటాయని పేర్కొన్నారు. అంతేకాక ఇక్కడ ఎంపిక చేసే ఉత్పత్తులకు ట్రైఫెడ్ ద్వారా దేశవ్యాప్తంగా 120కేంద్రాల్లో విక్రయానికి ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

### సింగరేణిలో కార్మికుడికి గాయాలు

**మణుగూరు టౌన్:** సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని కొండాపురం భూగర్భ గనిలో ఓ సూపర్ వైజర్ ప్రమాదవశాత్తు గురువారం గాయపడ్డాడు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. సూరజ్ అనే వ్యక్తి ఎస్ఎంఎస్ ప్రైవేటు సంస్థలో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వర్తిస్తున్నాడు. భూగర్భ గనిలో గురువారం మొదటి షిఫ్ట్ ముగింపు సమయంలో కార్మికులు రూఫ్ బోల్టింగ్ మిషన్‌తో పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో పక్కనే పనులను పర్యవేక్షిస్తున్న సూపర్‌వైజర్‌కు బోల్ట్ తగిలి గాయమైంది. వెంటనే క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించినట్లు తెలిసింది. కాగా త్రుటిలో ప్రమాదం తప్పినట్లు అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటనపై అధికారులను వివరణ కోరేందుకు ఫోన్ ద్వారా ప్రయత్నించగా.. అందుబాటులోకి రాలేదు.

### ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

| | గరిష్ట | కనిష్ట |
|---|---|---|
| పెసలు | 7,100 | 6,700 |
| కందులు | 10,550 | 10,550 |
| మిర్చి | 16,500 | 9,050 |
| ఏసీ మిర్చి | 19,300 | 10,000 |
| ఏసీ తాలు | 10,000 | 9,000 |
| పత్తి | 7,350 | 5,000 |

– ఖమ్మం వ్యవసాయం

# ఉద్యమనేత ఇకలేరు..

**మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు 'రాయల' మృతి**

- రైలు ప్రమాదంలో కన్నుమూసిన చంద్రశేఖర్
- విప్లవోద్యమంలో రహస్య కార్యకర్తగా పనిచేసిన నేత







సంతాపసభలో మాట్లాడుతున్న పోటు రంగారావు (ఇన్‌సెట్) రాయల చంద్రశేఖర్ (ఫైల్)

**ఖమ్మంమయూరిసెంటర్/తిరుమలాయపాలెం:** విద్యార్థి దశ నుంచే ఉద్యమబాట పట్టి.. తుదికంటా ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేసిన సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కేంద్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాయల చంద్రశేఖర్ మృతి చెందారు. ఆయన మంగళవారం రాత్రి ఖమ్మంలో రైలు కింద పడి మృతి చెందగా.. మృతదేహం ఛిద్రం కావడంతో గుర్తించడం ఆలస్యమైంది. ఆయన కుటుంబ, ఆర్థిక సమస్యలతో ఆయన ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తుండగా బుధవారం రాత్రి కుటుంబీకులు అనుమానంతో జీఆర్పీ సిబ్బందిని సంప్రదించి మార్చురీలో పరిశీలించగా రాయల మృతి చెందినట్లు తేలింది. ఈ నేపథ్యాన సహచరులు, వివిధ పార్టీల నాయకులు, బంధువులు దిగ్భ్రాంతికి గురయ్యారు.

**విద్యార్థి దశ నుంచే విప్లవబాట..**

చంద్రశేఖర్ విద్యార్థిదశలో విప్లవోద్యమంలోకి వచ్చారు. ఖమ్మం ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాలలో పీడీఎస్‌యూ నాయకుడిగా విద్యార్థి సంఘం ప్యానల్‌లో జాయింట్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత 1975లో విప్లవోద్యమంలో రహస్య కార్యకర్తగా పనిచేశారు. మణుగూరు, అశ్వాపురం, సత్తుపల్లి ప్రాంత దళాల్లో పనిచేసిన ఆయన ఆయన అనేక ఎన్‌కౌంటర్ల నుంచి తప్పించుకున్నారు. ఆ తర్వాత రైతుకూలీ సంఘం నాయకుడిగా ఖమ్మం, ఉమ్మడి వరంగల్, ఇల్లందు ప్రాంతాల్లో ఉద్యమ నిర్మాణం చేశారు. పార్టీ పత్రికను కూడా నిర్వహించారు. హైదరాబాద్‌లో కూడా కొంతకాలం తన కార్యకలాపాలు నిర్వహించారు. ఏపీ రైతు కూలీ సంఘం ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం అఖిల భారత ప్రగతిశీల రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేస్తున్న ఆయన కొన్నాళ్లు రైతాంగ ఉద్యమ సంయుక్త కిసాన్‌మోర్చ ఆలిండియా జనరల్ కౌన్సిల్ మెంబర్‌గా, తెలంగాణ రాష్ట్ర కన్వీనర్‌గా పనిచేశారు. ఇక తన సోదరుడైన రాయల సుభాష్ చంద్ర బోస్(రవన్న) అనుచరుడిగా చంద్రశేఖర్ ప్రజాపంథా రాజకీయాలను అనుసరించాడు. మితవాద, అతివాద ధోరణులను, అవకాశవాద ధోరణులను వ్యతిరేకించాడు. ఇల్లెందు ఏరియాలో ప్రజాప్రతిఘటన, ఇతర గ్రూపులు చేస్తున్న దాడులను తిప్పికొట్టడానికి పార్టీ రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు ఇల్లెందు దళాల ఏరియా పొలిటికల్ ఇన్‌చార్జిగా పనిచేశారు.

**నివాళులు అర్పించిన నేతలు**

పోస్టుమార్టం అనంతరం చంద్రశేఖర్ మృతదేహాన్ని గురువారం ఖమ్మంలోని మాస్‌లైన్ పార్టీ కార్యాలయానికి తరలించగా పలువురు నివాళులర్పించారు. మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వరరావు, కెచ్చెల రంగయ్య, కే.జీ.రామచందర్, కె.రమ, ఎంపీలు రేణుకాచౌదరి, రామసహాయం రఘురాంరెడ్డితో పాటు వివిధ పార్టీల నాయకులు పెద్ద చంద్రన్న, పోతినేని సుదర్శన్, నున్నా నాగేశ్వరరావు, బాగం హేమంతరావు, పోటు ప్రసాద్, సాధినేని వెంకటేశ్వరరావు, ఆవునూరి మధు, మద్దినేని బేబి స్వర్ణకుమారి, మిక్కిలినేని నరేందర్, ముస్తఫా, తిరుమలరావు నివాళులర్పించి మాట్లాడారు. అలాగే, రాయల మృతిపై మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు సంతాపం ప్రకటించగా, మాస్‌లైన్ జాతీయ కమిటీ సంతాప సందేశాన్ని పంపింది. ఈ సందర్భంగా సంతాపసభలో మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు మాట్లాడుతూ రాయల చంద్రశేఖర్ విద్యార్థి దశలోనే విప్లవోద్యమంలోకి వచ్చారని గుర్తుచేశారు. ఉద్యమ క్రమంలో చంద్రశేఖర్ అనేక సమస్యలు ఎదురైనా దృఢంగా నిలబడ్డారని, నమ్మిన ప్రజాపంథా రాజకీయాల వెనుకే కొనసాగారని కొనియాడారు. కాగా, రాయల స్వగ్రామమైన తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలులో అంత్యక్రియలు నిర్వహించగా, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు, ప్రజాప్రతినిధులు బెల్లం శ్రీనివాస్ కే.జీ.రాంచందర్, కెచ్చెల రంగయ్య, కె.రమ, గోకినపల్లి వెంకటేశ్వర్లు, సాధినేని వెంకటేశ్వరరావు, పోటు సూర్యం, వేములపల్లి వెంకటరామయ్య, గోవర్ధన్ మధు, సంధ్య, ఝాన్సీ తదితరులు అంత్యక్రియల్లో పాల్గొని నివాళులర్పించారు.

# అర్హులైన రైతులందరికీ రుణమాఫీ

**అధికారులతో సమీక్షలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్**



లైబ్రరీలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

**ఖమ్మం సహకారనగర్:** రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన రుణమాఫీ పథకం జిల్లాలో అర్హులైన ప్రతీ రైతుకు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం బ్యాంకర్లు, వ్యవసాయ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. రుణమాఫీకి రేషన్‌కార్డు తప్పనిసరి కాదని, రైతు కుటుంబాన్ని గుర్తించేందుకు ప్రామాణికంగా తీసుకుంటున్న విషయమై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ అంశంపై సందేహాల నివృత్తికి కేంద్రాలు ఏర్పాటుచేయాలని సూచించారు.

**భూసేకరణ పూర్తి చేయండి**

జిల్లాలో చేపడుతున్న వివిధ ప్రాజెక్టులు త్వరగా పూర్తయ్యేలా చేసేలా అధికారులు చేపట్టాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన అధికారులతో జాతీయ రహదారులకు భూసేకరణ, ధంసలాపురం వద్ద ఎంట్రీ, ఎగ్జిట్‌పాయింట్ల నిర్మాణం, సీతారామ ఎత్తిపోతల పథకం లింక్ కాల్వ మిగులు భూసేకరణపై సమీక్షించి వివరాలు ఆరా తీశారు. అలాగే, ఇంటిగ్రేటెడ్ హాస్టళ్ల సముదాయం, ఇంటర్నేషనల్ పాఠశాలలు, కూసుమంచిలో 100 పడకల ఆస్పత్రి, ఐటీఐ, స్వామినాథన్ పాఠశాల స్థల సేకరణపై దృష్టి సారించాలన్నారు.

**పట్టుదలతో కృషిచేస్తేనే లక్ష్యసాధన**

**ఖమ్మంగాంధీచౌక్:** పట్టుదలతో ముందుకు సాగితే లక్ష్యాన్ని సాధించవచ్చని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ఖమ్మంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని సందర్శించిన ఆయన పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతతో మాట్లాడారు. సిలబస్‌ను అనుసరించడమే కాక పరస్పరం సహకరిస్తూ చదువుకోవాలని చెప్పారు. అంతేకాక పరాజయం ఎదురైనా నిరాశకు లోను కావొద్దని తెలిపారు. కాగా, లైబ్రరీలో టాయిలెట్లు, తాగునీరు తదితర సమస్యలను నిరుద్యోగులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. ఆతర్వాత నగరంలోని వెజ్, నాన్‌వెజ్, కూరగాయల మార్కెట్‌ను సందర్శించిన కలెక్టర్ వ్యాపారులతో మాట్లాడి లాభనష్టాలపై ఆరా తీశారు. మహిళలు గొర్రెలు, మేకలు, గేదెల పెంపకం, బ్యూటీపార్లర్లు, మీ సేవా కేంద్రాల నిర్వహణపై దృష్టి సారించాలని సూచించారు. ఈకార్యక్రమాల్లో అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ, ఎస్‌డీసీ రాజేశ్వరి, డీఏఓ విజయనిర్మల, డీసీఓ ఖుర్షీద్, జిల్లా ఉద్యానవన అధికారి వెంకటరమణ, ఇన్‌చార్జ్ ఎల్‌డీఎం శివకుమార్, జిల్లా మార్కెటింగ్ అధికారి మార్కెటింగ్ అధికారి ఎం.ఏ.అలీం, ఆర్డీఓలు గణేష్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

- జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు
- సాదాసీదాగా జెడ్పీ సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న చైర్మన్ కమల్‌రాజు, పక్కన సీఈఓ వినోద్



అరకొరగా హాజరైన అధికారులు, సభ్యులు

**ఖమ్మంవన్‌టౌన్:** సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యాన వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు సూచించారు. ఖమ్మంలోని జెడ్పీ సమావేశ మందిరంలో గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వర్షం కారణంగా మధ్యాహ్నం 12గంటలకు సమావేశం ప్రారంభం కాగా.. తొమ్మిది కమిటీలకు గాను ఒకటి, రెండు కమిటీల సమావేశాలే జరిగాయి. వైద్య, ఆరోగ్యశాఖ, సాంఘిక సంక్షేమ శాఖ కార్యక్రమాలపై డీఎంహెచ్ఓ డాక్టర్ బీ మాలతి, సోషల్ వెల్ఫేర్ డీడీ కస్తాల సత్యనారాయణ వివరించారు. అనంతరం జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఈ విషయమై ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. అలాగే, రోజురోజుకు పెరుగుతున్న వీధికుక్కల సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. ఇక ప్రభుత్వ వసతిగృహాలు, పాఠశాలల్లో మెనూ ప్రకారం భోజనం సమకూర్చాలని, విద్యార్థుకు అన్ని వసతులు కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ వినోద్, డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### వరకట్న వేధింపుల కేసు నమోదు

**మధిర:** వరకట్నం కోసం తనను వేధిస్తున్నట్లు వివాహిత చేసిన ఫిర్యాదుతో మధిర టౌన్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. మధిరకు చెందిన గోగుల శ్రీలక్ష్మి తనను భర్త, అత్తమామలతో పాటు ముగ్గురు ఆడపడుచులు కట్నం తీసుకురావాలని వేధిస్తున్నట్లు పోలీసులను ఆశ్రయించింది. దీంతో గుంటూరుకు చెందిన ఆమె భర్త మొక్కల శ్రీను, అత్తమామలు, ముగ్గురు ఆడపడుచులపై కేసు నమోదు చేశారు.

### పిచ్చికుక్క స్వైరవిహారం

**వైరా:** మండలంలోని స్టేజీ పినపాక గ్రామంలో గురువారం ఓ పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. గ్రామంలో ఉదయాన్నే ఇంటి ముంగిట ముగ్గు వేస్తున్న మహిళను సూర్యదేవర సుశీల వీధి కుక్క నే మహిళను గాయపరిచింది. అనంతరం తేళ్లపుట్ట వెంకమ్మను కరవడంతో పాటు వారి ఇంట్లోని ఎద్దును సైతం కరిచింది. అంతేకాక తడికమళ్ల నగేష్‌కు చెందిన గేదె, దూడను, నర్వనేని శ్రీనుకు చెందిన పెంపుడు కుక్కతో పాటు మరో వీధి కుక్కను కరిచి పారిపోతుండగా గ్రామస్తులు వెంటాడి హతమార్చారు.

# 108 అంబులెన్స్‌లో ఇద్దరి ప్రసవం



చిమ్మపుడిలో బిడ్డను తల్లికి అప్పగిస్తున్న 108 సిబ్బంది

**రఘునాథపాలెం/అశ్వాపురం:** ఉమ్మడి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ప్రసవం కోసం తరలిస్తున్న గర్భిణులకు మార్గమధ్యలోనే నొప్పులు పెరగడంతో 108 సిబ్బంది పురుడు పోసి అభినందనలు అందుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం చిమ్మపూడికి చెందిన నిండు గర్భిణి తోటపల్లి అనూష పురిటినొప్పులతో బాధపడుతోందని బుధవారం అర్ధరాత్రి సమాచారం అందడంతో 108 ఈఎంటీ తుమ్మ జగదీష్, పైలట్ కుంచం మహేష్ జోరువానలో గ్రామానికి చేరుకున్నారు. అక్కడి నుంచి అనూష, ఆమె భర్త ప్రవీణ్, అత్త హైమావతి, ఆశ కార్యకర్త మేడె శ్రీలక్ష్మిని తీసుకుని ఖమ్మం వస్తుండగా ఆమెకు నొప్పులు పెరగడంతో గ్రామం దాటాక అర్ధరాత్రి రాత్రి 1-45 గంటలకు రహదారి పక్కన వాహనాన్ని ఆపి సాధారణ ప్రసవం చేయడంతో అనూష మూడో కాన్పులో మగబిడ్డను జన్మనిచ్చింది.

అనంతరం తల్లీబిడ్డలను ఖమ్మం ఎంసీహెచ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఈఎంటీ, పైలట్‌ను 108 ఎగ్జిక్యూటివ్ మేనేజర్ దుర్గాప్రసాద్, జిల్లా ప్రోగాం మేనేజర్ భూమా నాగేందర్ అభినందించారు. ఇక భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం బట్టీలగుంపు గ్రామపంచాయతీ పరిధి మారుమూల గ్రామమైన రాంనగర్‌కు చెందిన కొసల్య గురువారం 108 వాహనంలో ప్రసవించింది. ఆమెకు పురిటి నొప్పులు వస్తుండగా కుటుంబసభ్యులు ఇచ్చిన సమాచారంతో సిబ్బంది చేరుకుని ఆస్పత్రికి తీసుకొస్తున్నారు. అయితే, మార్గమధ్యలోనే కౌస్యలకు నొప్పులు పెరగడంతో వాహనంలో ఈఎంటీ సుజాత, ఆశావర్కర్ శోభారాణి ఆమె ప్రసవం చేయగా.. తల్లీబిడ్డలను అశ్వాపురం పీహెచ్‌సీకి తరలించారు.

### లారీపై విరిగి పడిన చెట్టు



చెట్టు కొమ్మ పడడంతో ధ్వంసమైన లారీ

**తల్లాడ:** తల్లాడలో జాతీయ రహదారిలో గురువారం ఓ చెట్టు విరిగి లారీపై పడగా.. తృటిలో ప్రమాదం తప్పింది. కల్లూరు వైపు నుంచి ఖమ్మం వైపునకు లారీ వెళ్తుండగా చెట్టు కొమ్మ విరిగి క్యాబిన్‌పై పడింది. లారీ క్యాబిన్‌పై కాక కొద్దిమేర వెనక భాగంలో పడడంతో నిమిషం వ్యవధిలో డ్రైవర్, క్లీనర్ ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఈ ఘటనతో జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోగా ఎస్ఐ బి.కొండల్‌రావు సిబ్బందితో చేరుకుని చెట్టు కొమ్మను క్రేన్ సాయంతో తీయించి రాకపోకలను క్రమబద్ధీకరించారు.

### భూవివాదంలో అన్నపై తమ్ముడి దాడి

**కూసుమంచి:** భూవివాదం కారణంగా అన్నపై తమ్ముడు గడ్డపలుగుతో పొడిచి గాయపర్చిన ఘటన మండలంలోని గట్టుసింగారంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... గ్రామానికి చెందిన రేపాకుల శ్రీను, మాధవ్ అన్నదమ్ములు. వీరికి 2.19 ఎకరాల వ్యవసాయ భూమి పొత్తులో ఉంది. అయితే, భూమి శ్రీను పేరున పట్టా కాగా మాధవ్ వాటా భూమిలో సైతం శ్రీను సాగుచేస్తూ కౌలు చెల్లిస్తున్నాడు. ఈ ఏడాది మాత్రం తానే సాగు చేసుకుంటానని మాధవ్ కొన్నాళ్లుగా గొడవ పడుతున్నాడు. ఈక్రమంలోనే గురువారం చేనులో ఉన్న శ్రీను వద్దకు వెళ్లి గొడవ పడ్డాడు. అక్కడే ఉన్న గడ్డ పలుగుతో శ్రీను తలపై కొట్టడమే కాక కుడి కాలుపై పొడవడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. ఈమేరకు క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించి బాధిత కుటుంబం ఫిర్యాదుతో మాధవ్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# డీఎస్సీ పరీక్షలు తొలిరోజు ప్రశాంతం



పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న దివ్యాంగ అభ్యర్థి



అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న సిబ్బంది



వర్షం వస్తుండడంతో ఆటోలో వేచి ఉన్న అభ్యర్థి కుటుంబీకులు

**ఖమ్మం సహకారనగర్/ఖమ్మం రూరల్:** ఉపాధ్యాయ నియామకాల కోసం నిర్వహిస్తున్న డీఎస్సీ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. జిల్లాలోని ఆరు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తుండగా ఉదయం 855మందిలో 758మంది, మధ్యాహ్నం పరీక్షకు 651మందిలో గాను 544మంది హాజరయ్యారు. కాగా, తొలిరోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డీఈఓ సోమశేఖరశర్మ వెల్లడించారు. ఆయన ఖమ్మంలోని ఎస్‌బీఐటీ కళాశాల పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. అయితే, గురువారం తెల్లవారుజాము నుంచే ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో అభ్యర్థులు ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. ఇక ఖమ్మం రూరల్ మండలం పెద తండాలోని ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాల, సత్యనారాయణపురంలోని డేర్ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రాల్లోనూ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని అధికారులు వెల్లడించారు. కాగా, ఖమ్మంలోని ఓ పరీక్ష కేంద్రానికి అభ్యర్థి ఒకరు రెండు నిమిషాల ఆలస్యంగా రావటంతో అధికారులు అనుమతించలేదు.ఇక ఒక పరీక్ష కేంద్రంలో దివ్యాంగ అభ్యర్థులకు మొదటి, రెండో అంతస్తుల్లో సీటింగ్ కేటాయించడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

# మా ప్రభుత్వం పేదల పక్షం...

- ఖమ్మంలో యూనివర్సిటీ, ఇర్రేడియేటెడ్ ప్లాంట్ ఏర్పాటుకు కృషి
- ఎంపీలు రఘురాంరెడ్డి, రేణుకాచౌదరి



మాట్లాడుతున్న ఎంపీ రేణుకాచౌదరి, పక్కన రఘురాంరెడ్డి తదితరులు

**ఖమ్మంవన్‌టౌన్:** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి అని.. ఈ ప్రభుత్వం ఏర్పాటయ్యాకే సంక్షేమ పథకాలతో కోట్లాది మంది నిరుపేదలకు లబ్ధి జరుగుతోందని ఎంపీలు రామసహాయం రఘురాంరెడ్డి, రేణుకాచౌదరి తెలిపారు. ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రైతులను అన్నిరకాలుగా ఆదుకోవాలనే కృతనిశ్చయంతో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వాన రుణమాఫీకి శ్రీకారం చుట్టామని, త్వరలోనే రైతుభరోసా కూడా అందుతుందని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా సమగ్రాభివృద్ధికి సమష్టిగా కృషి చేస్తామని చెప్పారు. జిల్లాకు యూనివర్సిటీతో పాటు వెటర్నరీ కళాశాల, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ టూల్ డిజైనింగ్ శిక్షణ కేంద్రం మంజూరు చేయించడమే కాక అత్యాధునిక సదుపాయాలతో లైబ్రరీ నిర్మిస్తామన్నారు. అలాగే, పంటల ప్రాసెసింగ్ యూనిట్(ఇర్రెడియేటెడ్) స్థాపనకు కృషి జరుగుతోందని, పాలేరులో రెగట్టా పోటీలను సైతం నిర్వహిస్తామని తెలిపారు. సత్తుపల్లి, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, జారె ఆదినారాయణ మాట్లాడగా డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు ముస్తఫా, నాగ సీతారాములు, నాగండ్ల దీపక్‌చౌదరి, మానుకొండ రాధాకిషోర్, మిక్కిలినేని నరేందర్, సంపెట శ్రీనివాస్, మద్ది శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఎంపీలతో కలెక్టర్ భేటీ**

**ఖమ్మం సహకారనగర్:** జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళికాయుతంగా ముందుకు సాగాలని ఎంపీలు రేణుకా చౌదరి, రామసహాయం రఘురాంరెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం వారు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీలు మాట్లాడుతూ ప్రణాళికలు రూపొందించాలని, ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచాలని తెలిపారు. ఇదేసమయాన కేంద్రం నుండి రావాల్సిన నిధుల విషయమై తాము చర్యలు తీసుకుంటామని చెప్పారు. సత్తుపల్లి, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు మట్టా రాగమయి దయానంద్, జారే ఆదినారాయణ, అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ పాల్గొన్నారు.

# మధిరలో ఏం జరుగుతోంది?

- చర్చనీయాంశంగా మారిన పోలీసు శాఖ తీరు
- కలకలం సృష్టించిన 'సాక్షి' కథనం

**మధిర:** మధిర పట్టణంలో వరుస చోరీలు, నానాటికీ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య, కొందరు పోలీసుల తీరుపై వస్తున్న విమర్శలు చర్చనీయాంశంగా మారాయి. ఈ అంశంపై 'సాక్షి'లో గురువారం 'అటు దొంగలు.. ఇటు ట్రాఫిక్' శీర్షికన కథనం ప్రచురితం కాగా ఉన్నతాధికారులు స్పందించారు. జిల్లాలోని పోలీస్ అధికారులతో ఉదయం జరిగిన కాన్ఫరెన్స్‌లో సీపీ సునీల్ దత్ పరోక్షంగా 'సాక్షి' కథనాన్ని ప్రస్తావిస్తూ అందులోని అంశాలపై ఆరా తీసినట్లు తెలిసింది. ప్రధానంగా చోరీలకు అడ్డుకట్ట వేయాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆదేశించారని సమాచారం.

**ఆరోపణలపై ఆరా**

మధిర టౌన్ పోలీస్ అధికారిపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి వైరా ఏసీపీ రెహమాన్ ఫోన్‌లో ఆరా తీసినట్లు తెలిసింది. ఇల్లూరు రేవులో అక్రమంగా ఇసుక తరలింపునకు సహకరించారనే ఆరోపణలు ఉండడంతో ట్రాక్టర్ల డ్రైవర్ల ఫోన్ నంబర్లు సేకరిస్తున్నట్లు సమాచారం. అలాగే, స్థానికంగా ఓ భవనంలో పేకాట శిబిరం నిర్వహణకు అనుమతించి మధ్యవర్తి ద్వారా ముడుపులు తీసుకున్నట్లు జరుగుతున్న ప్రచారంపైనా ప్రశ్నించినట్లు తెలిసింది. ఇటీవల ఓ కిరాణా వ్యాపారి బైక్ చోరీకి గురైతే సీసీ ఫుటేజీ ఆధారంగా ఫిర్యాదు చేసినా పది రోజుల వరకు కేసు నమోదు చేయడం ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. కాగా, గతంలోనూ పోక్సో కేసుకు సంబంధించి జిల్లా అధికారులు ఆదేశించే వరకు నమోదు చేయకపోవడం, పలు చోరీ కేసుల్లో దర్యాప్తు ముందుకు సాగని విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినట్లు తెలిసింది. ఈమేరకు సమగ్ర నివేదికను అధికారులు సీపీకి అందించేందుకు సిద్ధం చేసినట్లు సమాచారం. అయితే, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర నియోజకవర్గంలో పోలీసుల వ్యవహార శైలిపై విమర్శలు వస్తుండడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

### జాబితాలో నా పేరు ఉందా?



జాబితాలో పేర్లు చూసుకుంటున్న రైతులు

**రఘునాథపాలెం:** రూ.లక్ష రుణమాఫీ అయిన అన్నదాతల జాబితాలను రైతువేదికల వద్ద ప్రదర్శించారు. వీ.వీ.పాలెం రైతువేదిక వద్ద ఖమ్మంఅర్బన్, రఘునాథపాలెం, కామేపల్లి మండలాలకు జాబితా ప్రదర్శించగా... రైతులు పలువురు తమ పేరు ఉందా, లేదా అని వెతుక్కోవడం కనిపించింది. పేర్లు ఉన్న వారు సంతోషించగా.. పేర్లు లేని వారు అధికారులను ఆరా తీయడం కనిపించింది.